ప్రజాశక్తి
మంగళవారం 16 మే 2023
5
అల్లూరి సీతారామరాజు

పసుపు ధర పతనం

సంతలో పసుపు బస్తాలు

ప్రజాశక్తి - పెదబయలు: మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో పసుపు ధర భారీగా తగ్గింది. మూడు వారాల క్రితం కిలో పసుపు రూ.60 ఉండగా ఈ వారం రూ.40కి విక్రయాలు జరిగాయి. దళారులు సిండికేట్‌గా మారడంతో ధరలు భారీగా తగ్గుతున్నాయి. మారుమూల ప్రాంతాల నుండి గిరిజనులు వాహనాల్లో సంతకు తెచ్చిన పసుపునకు గిట్టుబాటు ధర లేక పోవడంతో దిక్కుతోచని స్థితిలో గిరిజనులు ఆందోళన చెందారు. కనీసం రవాణా ఛార్జీలు కూడా రాలేదని వాపోయారు. అధికారులు దళారుల మోసాలను అరికట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపును జిసిసి కొనుగోలు చేయాలని సిపిఎం, గిరిజన సంఘాలు పలుమార్లు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా కనీసం స్పందించ లేదన్నారు.

జూనియర్ కళాశాల రోడ్డు స్థలం కబ్జా

- బివికె యాజమాన్యం చేపడుతున్న పనులు అడ్డగింత-పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది

నిర్మాణానికి తవ్విన గొయ్యిలు

ప్రజాశక్తి - అరకు లోయ : అరకులోయలోని పాత పోస్ట్ ఆఫీస్ కాలనీ నుంచి జూనియర్ కళాశాల, సి.కాలనీ కి వెళ్లే రోడ్డును భారతీయ విజ్ఞాన కేంద్రం (బివికె) పాఠశాల యాజమాన్యం కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మాణానికి గొయ్యిలు తవ్వుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూనియర్ కళాశాల స్థాపించినప్పుడే అప్పట్లో ప్రభుత్వం పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతం నుంచి జూనియర్ కళాశాల సి.కాలని వెళ్లడానికి స్థలాన్ని కేటాయించి మార్గం వేశారు. జూనియర్ కళాశాలకు వెళ్లడానికి కింద సైన రోడ్డు ఉండగా, ఒకవేళ్ళ గేట్లు పెట్టి, పాత పోస్ట్ ఆఫీస్ నుంచి వెళ్లే మార్గంలో గేట్లు వేయక పోవడంతో పక్కనే ఉన్న విజ్ఞాన భారతి పాఠశాల యాజమాన్యం కన్ను ఆ స్థలంపై పడింది. ఈ రోడ్డు కేవలం జూనియర్ కళాశాలకు వెళ్లడానికి కాకుండా ఆ చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల విద్యార్థులకు సెలవులు ఇవ్వడంతో ఈ దారిలో రాక పోకలు తగ్గింది. ఇదే అదునుగా భావించిన బివికె యాజమాన్యం స్కూలు పరిధి దాటి రోడ్డును కూడా ఆక్రమించే ప్రయత్నం చేస్తుంది. ఇందులో భాగంగానే రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకొని ఎవరు లేని సమయంలో ఆదివారం రాత్రి రోడ్డులో పిల్లర్ గొయ్యి తవ్వించారు. విషయం తెలుసుకున్న స్థానికులు, చుట్టుపక్కల నివాసులు రోడ్డును మూసేస్తే తామెలా నడిచేదని, జూనియర్ కళాశాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించి అడ్డుకున్నారు.అయినా వినకుండా పనులు చేపడుతుండడంతో స్థానికులు, ఏపీ గిరిజన సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం నాయకులు పి.రామన్న, కె.రామారావు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు వివి జయ, అరకులోయ టౌన్షిప్ ఎంపిటిసి దురియా ఆనంద్ కుమార్, వైసిపీ నేత కమిడి అశోక్, జనసేన నాయకుడు శ్రీరాములు ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.ఆర్ఐ, వీఆర్వోలకు ఫిర్యాదు చేయగా స్పందించిన వారు వెంటనే ఆ స్థలంలో చేరుకొని వారు కూడా పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మిస్తే ఈ రుకునేదిలేదని ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డును ఆక్రమించే హక్కు బీవీకే పాఠశాలకు(

రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రైవేటు) పాఠశాల యాజమాన్యానికి ఎవరు ఇచ్చారని ఎంపిటిసి ఆనంద్ కుమార్, గిరిజన సంఘం నాయకులు రామన్న రామారావులు ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పీవో, సబ్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు స్పష్టం చేశారు.రోడ్డులో ప్రహరీ గోడ నిర్మాణానికి గొయ్యిలు తవ్వడంతో కిందన ఉన్న వాటర్ పైపులైన్ దెబ్బతిందని దీంతో పాత పోస్ట్ ఆఫీస్ కాలనిలో నీటి సరఫరా నిలిచి పోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. దెబ్బతిన్న వాటర్ పైపులను వెంటనే మరమ్మత్తులు చేసి ఆ గోతులను పూడ్చి వేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ కాలనీవాసులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే జూనియర్ కళాశాలకు సంబంధించిన స్థలాన్ని కూడా వెనుక భాగం నుంచి బివికే పాఠశాల యాజమాన్యం ఆక్రమించి ఉందని వారు ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బివికె యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ప్రహరీ గోడకు రోడ్డును తవ్విన కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పోస్ట్ ఆఫీస్ నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే ఈ మార్గంలో గేటు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలంను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

డి పట్టా లబ్ధిదారుల గుర్తింపు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: డి పట్టా భూముల పంపిణీకి లబ్ధిదారుల గుర్తింపును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వీడియో సోమవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల రీసర్వే, డి.పట్టా భూముల గుర్తింపు, పివిటిజి ఓటర్ల నమోదు, స్పందన ఫిర్యాదుల పరిష్కారం పై సమీక్షించారు. రెండు నెలల నుండి 2502 గ్రామాలకు గాను 169 గ్రామాల్లో మాత్రమే డి పట్టా భూములను గుర్తించారని చెప్పారు. విఆర్‌ఓల పనితీరు మార్చుకోవాలని, డి పట్టా భూములు గుర్తింపులో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూములు రీసర్వే చేసేటప్పుడు సంబంధిత షెడ్యూలును అటవీ శాఖ అధికారులకు పంపించి రీసర్వే పై సమాచారం అందిస్తే రీ సర్వేలో ఆ శాఖ అధికారులు పాల్గొంటారని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. 293 గ్రామాల్లో వెక్టరైజేషన్ ప్రక్రియ జరుగుతోందని, 250 గ్రామాల్లో పూర్తయ్యిందని చెప్పారు. 240 గ్రామాల్లో సర్వే డేటా అప్లోడ్ చేయాలన్నారు. డేటా నమోదు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఫారం 7,10 సేకరణ త్వరితగతిన చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ మ్యుటేషన్లపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలని స్పష్టం చేసారు. మ్యుటేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తే రైతులకు రైతు భరోసా పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. వి ఆర్‌ఓలు సక్రమంగా పనిచేయకుంటే జీతాలు నిలుపుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, డి ఆర్‌ఓ పి.అంబేద్కర్, 22 మండలాల తహాశీల్దారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ ఉత్సవాలు

బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల రెండో రోజైన సోమవారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో సందడి నెలకొంది. శతకంపట్టు వద్ద కొలువైన ఉత్సవ విగ్రహం, పాదాలను, అమ్మవారి ఆలయంలోని మోదకొండమ్మను మన్యం నలుమూలల నుంచే కాకుండా మైదాన ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

పట్టణంలో ఎటు చూసినా సందడి వాతావరం నెలకొంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జైంట్ వీల్, డ్రాగన్ ట్రైన్, గాల్లో తేలియాడే పడవ, చిన్నపిల్లల ఆటల పరికరాలు ఏర్పాటు చేయడంతో చిన్న, పెద్దలతో సందడి నెలకొంది. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్‌పి అతుల్ సిన్హా, ఎఎస్‌పి ధీరజ్ కునుబిల్లి పర్యవేక్షణలో స్థానిక సిఐ బి.సుధాకర్, ఎస్‌ఐలు లక్ష్మణరావు, రంజిత్, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలువురు సిఐలు, ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ అందర్నీ ఆకట్టుకుంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే వారంతా విద్యుత్తు లైటింగ్ లను ఎంతో ఆసక్తిగా తిలకించారు. అమ్మవారి ఆలయం మొదలుకుని ప్రధాన మార్గాలు, కూడళ్లలో ఏర్పాటు చేసిన లైటింగ్ కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయి. పట్టణంలోని ఆయా కూడళ్లలో ఏర్పాటుచేసిన దేవత రూపాల లైటింగ్ సెట్ లు ఆకర్షణీయంగా ఉన్నాయి.

భారీ విద్యుత్ సెట్టింగ్

అనుపోత్సవం నేడు..

మోదకొండమ్మ మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ముగింపు రోజైన మంగళవారం అనుకోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు. తొలి రోజు శతకంపట్టులో కొలువుతీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంటుంది. తొలి రోజు ఆలయం నుంచి ఊరేగింపుగా శతకం పట్టు వద్దకు తీసుకుని వచ్చి కొలువు తీర్చిన అమ్మవారి ఉత్సవ విగ్రహం పాదాలను తిరిగి ఆలయంలో కొలువు తీర్చే అనుపోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఆకట్టుకున్న స్టాల్స్

మోదకొండమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఐటిడిఎ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రదర్శించిన స్టాల్స్ కు మంచి స్పందన లభిస్తోంది. మన్యంలోని ఐటిడిఎ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి. ప్రజలకు రాయితీపై అందిస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రచార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ ప్రహరీని అనుకుని ప్రధాన రహదారి వద్ద ఏర్పాటుచేసిన ఈ స్టాల్స్‌ను పండగకు విచ్చేసిన భక్తులు సందర్శిస్తున్నారు. ఐటిడిఎ చేపట్టిన అభివృద్ధిపై సమాచార శాఖ ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శన, జిసిసి, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, ఐసిడిఎస్, వెలుగు, తదితర శాఖలు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లు చూపులను ఆకట్టుకున్నాయి. ప్రతి విభాగం నుంచి ఇన్ ఛార్జిగా ఉన్న ఉద్యోగి వీక్షకులకు పథకం గొప్పతనాన్ని, పథకం ద్వారా జరిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాలను కళ్ళకు కట్టినట్లు ప్రచార స్టాల్స్ ద్వారా వివరిస్తున్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని గేమ్మెలి పంచాయతీ గొడుగురాయి గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వనుగు సన్యాసిదొర, కటారి కోటిబాబు మాట్లాడుతూ, గొడుగురాయి గ్రామంలో రోడ్డు సౌకర్యం, స్కూలు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు.గతంలో ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో రోడ్డు, మంచినీరు, స్కూలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే దశలవారీగా గ్రామస్తులతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు. ఈనెల 22న సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు వంజరి పిన్నం నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు సలుగు సత్తిబాబు, పాంగి వెంకట్, నాయకులు కొరబు సింహాచలం, వెంకు నాయుడు, భాస్కర్‌రావు, తదతరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఐటిడిఎ స్పందనలో అర్జీలు సమర్పించిన ఏజెన్సీలోని మారుమూల గ్రామాల గిరిజనుల వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ.ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు, సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిరహించిన స్పందనలో వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ, స్పందనలో 30 దరఖాస్తులు వచ్చాయని, వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు.

సోమవారం స్పందనలో వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని కానివాడ పంచాయతీ జాజివలస గ్రామంలో చేపల చెరువుకు మరమ్మతులు చేయాలని, అదేవిధంగా ఈ చెరువుకు కాలువ బోదె ఏర్పాటు చేయాలని కొండ్ల లక్ష్మమ్మ దరఖాస్తు సమర్పించారు. పోలవరం ప్రాజెక్టులో చేపలు పట్టుకొనుటకు అనుమతి మంజూరు చేయాలని మూలం బుచ్చిరాజు, పైదా శివ దొర, మడెం గంగరాజు తో పాటు మొత్తం 16 మంది దరఖాస్తు సమర్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తనకు పింఛను మంజూరు చేయాలని వై రామవరం మండలం గుర్తేడు గ్రామానికి చెందిన సుంకరి భాస్కరరావు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఇఇలు .జి. దేవిడ్‌రాజు, ఎండీ యూసుఫ్, నాగేశ్వరరావు, డిఇఇలు సాయి సతీష్,ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్రబాబు, రామచంద్రమూర్తి, దుర్గాప్రసాద్, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, పిహెచ్ఒ చిట్టిబాబు, .ప్రాజెక్ట్ హార్టీకల్చర్ అధికారి.రాంబాబు, సిడిపిఒ సంధ్యారాణి, ఎఎంఒ సి. శ్రీహరి, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ అనూష, వైద్యాధికారులు డాక్టర్ రాధిక, డాక్టర్ కల్పన, పశు వైద్యాధికారి డాక్టర్ గోపిక, ఎడిఎ .సిహెచ్ కెవి చౌదరి, . గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి. పార్వతీశ్వరరావు, లీగల్ సెల్ న్యాయవాది ఎంపి సత్యనారాయణ పాల్గొన్నారు,

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం!

ఏళ్లు గడుస్తున్న నేటికీ పూర్తిస్థాయిలో అందని పరిహారం, ప్యాకేజీ : సిపిఎం

ప్రజాశక్తి- విఆర్.పురం: ఏళ్లు గడుస్తున్నా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం దుర్మార్గమని సిపిఎం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, త్యాగధనులని ప్రశంసలే తప్ప, నిర్వాసితులకు పూర్తి పరిహారం, ప్యాకేజీ, ఇతర సౌకర్యాలను కల్పించడం లేదని ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు.

సోమవారం మండలంలోని రేఖపల్లిలో సిపిఎం కార్యాలయం వద్ద కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ, నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిరోజుల్లో గ్రామాల్లో సర్వేలంటూ నానా హడావిడి చేసి, తర్వాత ముఖం చాటేశారన్నారు. సర్వేలతో కాలయాపన చేస్తూ నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తోందని విమర్శించారు. ముందుగా పరిహారం ఇచ్చిన గ్రామాల్లో, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తీసుకోకుండానే ఇంకా కొంతమంది లబ్ధిదారులు చనిపోతే, దాన్ని బాధిత కుటుంబసభ్యులకు ఇవ్వకుండా, కుంటిసాకులు చూపుతూ వారికి పంగనామం పెట్టాలని ప్రభుత్వం ,అధికారులు చూస్తుండడం దుర్మార్గమన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో 18ఏళ్లు నిండిన మేజర్ సన్స్‌కు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపులో 2017 కటాఫ్‌గా నిర్ణయించడం వల్ల అనేకమంది నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. పోలవరం నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేసే రోజునే కటాఫ్ తేదీగా ప్రకటించి, పరిహారాలు, ప్యాకేజీలు,ఇతర రాయితీలు, సౌకర్యాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

2010లో ఎకరాకు రూ.1.10లక్షల పరిహారం పొందిన భూములకు తాము అధికారంలోకి వస్తే రూ.3.80లక్షలు ఇస్తామంటూ ప్రకటించిన సిఎం జగన్, నాలుగేళుల గడిచినా ఇచ్చిన హామీ ఊసెత్తకపోవడం నిర్వాసితులను మోసపుచ్చడమేనని మండిపడ్డారు. పరిహారం ప్యాకేజీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేసేది లేదని, దీనిపై ప్రభుత్వమే దిగిరావాలని స్పష్టం చేశారు. బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి నిజమైన గిరిజనులను అన్యాయం చేస్తున్న వైసిపి ప్రభుత్వం,

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే, ఆదరించిన ఆదివాసీ గిరిజనులే గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఏ ఒక్కరికీ పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించకుండా, వారిని గాలికొదిలేసి ముంపు పేరుతో రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్తు తాగునీరు వంటి మౌలిక వసతులు పట్టించుకోకుండా నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వేల పేరుతో నిర్వాసితులను అయోమయానికి గురిచేయడం సరికాదని, నేటికీ పూర్తి పునరావాస పరిహారపు జాబితా ప్రకటించక పోతే పరిహారం ఎలా చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాకే, గ్రామాలను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో. సిపిఎం మండల నాయకులు గూటాల శ్రీనివాసరావు, తోవడం రాజు, కారం. సత్తిబాబు, సున్నం. రంగమ్మ, సున్నం.నాగమ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -సీలేరు: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో సీలేరులో ప్లాస్టిక్ నివారిద్దాం, పచ్చని చెట్లు సంరక్షిద్దాం అని నినాదాలు చేస్తూ, పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మెయిన్ రోడ్డుకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి అందరూ భాగస్వాములు కావాలని అందరితో అడవి శాఖ దారకొండ సెక్షన్ ఆఫీసర్ సతీష్ ప్రతిజ్ఞ చేయించారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు నేటి మొక్కలే రేపటి వృక్షాలు ప్లాస్టిక్ ని నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటిముందు మొక్కలు నాటడం వల్ల పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా, కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు చెట్లు నాటి వాటిని పరిరక్షించవలసిన బాధ్యత మనమే తీసుకోవాలని కోరారు. అలాగే సీలేరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని అటవీ వనాల కాపాడడానికి అటవీ శాఖ సిబ్బందికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, ఇన్చార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, టిడిపి నేతలు నక్క .తిరుమలరావు, అటవీశాఖ తోకరాయి సెక్షన్ ఆఫీసర్ వివేకానంద రావు, బీట్ ఆఫీసర్లు చిట్టిబాబు, కొండబాబు, సత్యనారాయణ, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ప్రకాష్, బేస్ క్యాంపు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్నదొర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వేసవి దృష్ట్యా మండలంలోని 19 పంచాయతీల్లో ఉన్న గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎంపిడిఒ కె.బాపన్నదొర తెలిపారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని వినియోగంలోకి తెచ్చేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఆదేశించామన్నారు. సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులతో మమేకమై తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు, అలాగే గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, కలుషిత వాతావరణం లేకుండా చూడాలన్నారు, విధుల నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండుటెండలకు జనం బెంబేలు

నిర్మానుష్యంగా వీధులు, రోడ్లు ... వెలవెలబోయిన వారపుసంతలు

సీలేరులో నిర్మానుష్యంగా మెయిన్‌రోడ్డు , జంక్షన్

ప్రజాశక్తి -సీలేరు: మన్యంలో గణనీయంగాపెరిగిన ఉష్ణోగ్రతలు, మండుటెండలు, ఉక్కపోత దెబ్బకు జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. సోమవారం సూర్యుడు తన ప్రతాపాన్ని మరింతగా చూపించాడనే చెప్పాలి, మధ్యాహ్నం ఒంటిగంటకు సీలేరులో 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, ఎండల తీవ్రత, వడగాలులు, ఉక్కపోత దెబ్బకు దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉందా అన్నట్లుగా జనం ఇళ్లల్లోంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. రెక్కాడితే గాని డొక్క నిండని దినసరి కూలీలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో వారి జీవనం దుర్భరంగా మారింది.ఎండదెబ్బకు వృద్ధులు, చిన్నారులైతే విలవిల్లాడిపోతున్నారు.

బోసిపోయిన వారపుసంత

విఆర్.పురం: ఎండ తీవ్రతకు విఆర్‌పురం సంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు హడలిపోయారు. వి ఆర్ పురం, కూనవరం మండలం నుంచి కూర గాయలతో వచ్చిన గిరిజన మాలీలు బరకాలు వేసుకొని, గొడుగుల నీడన దుకాణాలు వేసినప్పటికీ, ఎండల తీవ్రత వల్ల సంతకు వచ్చేవాళ్లు లేపకోవడంతో వారపుసంత బోసిపోయినట్లు కనిపించింది. ఎండతీవ్రత ప్రభావం సోమవారం వి ఆర్ పురం సంతలో స్పష్టంగా కనిపించింది. వ్యాపారులు వచ్చినప్పటికీ, కొనుగోలుదారులు రాకపోవడంతో చారపుసంత బోసిపోయింది. దినసరి కూలీలు కూరగాయలు, నిత్యావసరాలు కొనుగోలుకు వచ్చి పదిగంటల లోపే తిరుగు ప్రయాణం చేశారు

ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి చెట్ల నీడను ఆశ్రయించడంతోపాటు చల్లని పానీయాలు, తాటిముంజెలు, పండ్ల రసాలు, చల్లని నీటితో సేదదీరడం కనిపించింది. నాలుగు రోజుల నుంచి ఎండ తీవ్రతకు ప్రజలు రోడ్లమీద సంచరించలేని పరిస్థితి నెలకొంది. విఆర్ పురం సోమవారం 44 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 12.గంటలకు 41 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైనప్పటికీ, తర్వాత ఎండ తీవ్రత అనూహ్యంగా పెరిగి మూడు గంటలకు 44 డిగ్రీల సెంటీగ్రేడుకు చేరుకుని, సాయంత్రం ఆరుగంటల వరకు దాని తీవ్రత కనిపించింది.

విఆర్.పురంలో బోసిపోయిన వారపుసంత

మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

లోకేష్‌కు మద్దతుగా పాదయాత్ర

ప్రజాశక్తి-అరకులోయ: రాష్ట్రంలో కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని తెలుగుదేశం పార్టీ అరకు ఇంచార్జ్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్ర 100వ రోజులు చేరడంతో అరకులోయ నియోజకవర్గంలో సంఘీభావ పాదయాత్రను అరకు నియోజకవర్గం ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో దుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్ నుండి అరకు, యండపల్లి, పద్మాపురం మీదుగా అరకువేలి పట్టణ మీదుగా పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు అడుగడుగునా మహిళలు పూలమాలలు వేసి తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. నాలుగు రోడ్ల జంక్షన్లో నిర్వహించిన సభలో నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు కోసం లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు సివేరి దొన్ను దొర, తెలుగుదేశం సీనియర్ నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి బాబూరావు, మాజీ ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహం, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతాల నాగేశ్వరావు, టీడీపీ సీనియర్ నాయకురాలు బూర్జ లక్ష్మీ మాజీ ఎమ్మెల్యే సోమ సతీమణి ఇచ్ఛావతి, అరకు మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, మండలాల అధ్యక్షులు బుజ్జిబాబు, తుడుము సుబ్బారావు, కొర్ర తులసిరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకట రమణ, మాదగడ ఎంపీటీసీ సున్నాయి కృష్ణారావు, నాయకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్ కార్డులివ్వండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ జాబ్ కార్డులు అందజేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపీడీవో, ద్వామా అధికారులతో నిర్వహించిన మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సగటు వేతనం 252 రూపాయలు వస్తుందని, ఇది పెరిగే విధంగా పనులలో నాణ్యత పెంచాలని సూచించారు. చింతపల్లి, జికె వీధి తదితర మండలాల్లో అధికంగా జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులు తక్కువగా ఉన్నాయని వీటిని పెంచడంతో అందరికీ పని కల్పించడంతో పాటు సగటు వేతనం పెరుగుతుందని వివరించారు. పనులకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సెల్ఫ్ వర్క్స్ తయారు చేయాలన్నారు. వేతన దారుల ఆధార్ సీడింగ్, బ్యాంకు ఖాతాలు, మొబైల్ నెంబర్తో అనుసంధానం చేయాలని, ఇప్పటికే చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ తో అనుసంధానించి పనులు కల్పించాలని, పెండింగ్ లో ఉన్న సుమారు ఏడు కోట్ల రూపాయలను ఎఫ్టిఓ జనరేట్ చేయాలని ఆదేశించారు. కొండ ప్రాంతాలలో గృహ నిర్మాణాల రవాణా అధికంగా ఉందని ఎంపిడివోలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందిస్తూ అటువంటి వాటిని గుర్తించి ప్రతిపాదనలు పంపిస్తే అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనులలో ఉద్యాన పంటల పనులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పిల్లల ఆధార్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జనన ధ్రువీకరణ పత్రాలు అప్లోడ్ చేయడం ద్వారా పిల్లల ఆధార్లను జనరేట్ చేయాలని ఆదేశించారు. ఆధార్, జనన ధ్రువీకరణ లేని వారందరికీ ఆధార్, జనన ధ్రువీకరణ జనరేట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా బడి బయట ఉన్న వారిని గుర్తించి వారిలో ఎవరైనా బాధపడుతున్న వారికి తగు చికిత్స అందించాలన్నారు. జననీ సురక్ష యోజన కింద తల్లులతో బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయాలలో సూచించిన ఆరు రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో సహాయ కలెక్టర్ అభిషేక్, ద్వామా పీడీ రమేష్ రామన్, హౌసింగ్ పిడి బాబు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, సిపిఓ ఆర్ఎస్ఎన్ పట్నాయక్, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్, మండలాల నుండి ఎంపీడీవోలు, ద్వామా ఏ పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిబ్బంది

ఉపాధి పనుల కల్పనకు కృషి

ప్రజాశక్తి -హుకుంపేట: ఉపాధి పని కల్పించాలని మండలంలోని బూర్జ పంచాయతీ సులిపకోన్, సొంటర్ల పాడు, కొండయ్య పాడు మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన విషయ తెలిసిందే. దీంతో సోమవారం మూడు గ్రామ ప్రజలతో ఉపాధి హామీ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సంఘం నేతలను ఆహ్వానించారు. సమస్యలపై చర్చించారు. అనంతరం ఎన్.ఆర్.జి.పి ఫీల్డ్ అసిస్టెంట్, విఆర్పిఎ, టెకికల్ అసిస్టెంట్లు గ్రామాన్ని సందర్శించారు. పని దినాలు కల్పిస్తామని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తపుల కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

వేసవి శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో కళ్యాణ మండపం వద్ద ఆసరా ఛారిటబుల్ సొసైటీ సహకారంతో గిరిబాల నేస్తం ఆధ్వర్యాన సమ్మర్ క్యాంప్‌ను వైస్ ఎం.పి.పి1 పాటు బోయి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న పరిస్థితులలో ఆరు బయటకు వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, సిపిఎం మండల కార్యదర్శి బీమరాజు, శారదా నికేతన్ పాఠశాల సిబ్బంది సిహెచ్ మత్స్యరాజు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: స్థానిక శాఖ గ్రంధాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. గ్రంధాలయ అధికారిని సునీత మాట్లాడుతూ, చిన్నారులు విద్యతో పాటు ఆటల పోటీలో కూడా శ్రద్ధ కనబరచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల నాయకులు డిమాండ్

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు వివి విజయ

ప్రజాశక్తి - అరకు లోయ : మహిళా మల్లయోధులు రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి యం.పి బ్రిజ్ భూషణ్ శరత్ సింగ్ ను తక్షణం అరెస్టు చేయాలని అఖిల ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రెజ్లర్లపై జరుగుతున్న లైంగికల వేధింపులను నిరసిస్తూ, వారి న్యాయ పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో ఐద్వా మహిల సంఘం నాయకురాలు వివి జయ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దేశానికి అవార్డులు తెచ్చిపెట్టి, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మహిళా మల్ల యోధుల పై లైంగిక వేధింపులు చేయడం దారుణమన్నారు. యం.పి పై ప్రధానమంత్రి మోడి ఇప్పటికీ నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. రెజ్లర్ల కు అవార్డులు వచ్చినప్పుడు వాళ్లతో పొటోలు దిగిన మోడి కి ఇప్పుడు వారికి కష్టం వస్తే మాట్లాడకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు.సుప్రీంకోర్టు జోక్యంతో సమగ్ర దర్యాప్తు చేసి పరిష్కారానికి కమిటీలు వేసారని, యం.పి బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయలేదన్నారు. హర్యానా బిజెపి ప్రభుత్వం లో మంత్రి సందీప్ సింగ్ ను కుడా అరెస్టు చేయలేదని దీనిపై దేశ వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలు అనేక రూపాల్లో మద్దతు పోరాటాలు చేస్తున్నారన్నారు. మహిళ పై లైంగిక వేదింపులు జరుగుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఐద్వా నాయకురాలు శశికళ అధ్యక్షత వహించితీ ఈ కార్యక్రమంలో ఆశావ్ బ్యాంక్ బోర్డు అఫ్ డైరెక్టరు జీ.భగ్యవతి, గిరిజన సంఘం నాయకులు రామన్న, అదివాసీ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చట్టు మోహన్, నేచర్ సంస్థ ప్రతినిధి సంతోష్, విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు దనలక్ష్మీ, అసొ బ్యాంకు మేనేజర్ సునీత, గిరిజన మహిళా సంఘం నాయుకులు సన్యసమ్మ, గిరిజన సంఘం నాయుకులు నాని బాబు, గాసి, రామారావు చర్చ లో పాల్గొన్నారు.

ఎన్నికైన సభ్యులు

గిరిజన సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో గిరిజన సంఘ నూతన కమిటీనీ లక్ష్మీపురం సర్పంచ్ గుర్ర త్రినాథ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎంఎం శ్రీను, మండల కార్యదర్శిగా కొర్ర నరసయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్ష పదవి నిర్వహించిన గల్లెల నారాయణను, రాందాసులను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా పాటు బోయి సత్యనారాయణ, సిద్దు, సభ్యులుగా కే,దోంబ్రు, విక్రం, నారాయణ,లైకోన్ గణపతి, శ్రీను, కొండయ్య, గాసిరం దొర, కామేశ్వరరావు, ఈశ్వర్, నర్సింగ్ పడాల్, భీమన్నలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో సమస్యల పై పోరాటానికి సంసిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.బీమరాజు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు గిరాకీ

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండల కేంద్రంలో మోదకొండమ్మ తల్లి జాతర సందర్భంగా సోమవారం జరిగిన వారపు సంతలో మేకలు, గొర్రెలు, నాటు కోళ్లకు భారీ గిరాకీ ఏర్పడింది.మోదకొండమ్మ జాతరలో మన్యం వాసులు సంప్రదాయం ప్రకారం జత కోడి పుంజులు, మేక, గొర్రె పోతులు సమర్పించి మొక్కు తీర్చుంటారు. దీంతో మేక, గొర్రె పోతుల ధర 5వేల నుండీ 10వేలు, నాటుకోడి పుంజులు రూ. 1000 నుంచి 2000 పై చిలుకు ధర పలికింది. దీంతో పెంపకం దారులకు మంచి లాభాలు వచ్చాయి.

గీతంలో కాటన్ జయంతి

ప్రజాశక్తి-మధురవాడ : ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 220వ జయంతిని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన సోమవారం ఆర్థర్ కాటన్ భవనంలో నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్.విజయశేఖర్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్, సీనియర్ ప్రొఫెసర్లు బాలాజీ, నరేంద్ర, ఎమ్.రమేష్ తదితరులు కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని పచ్చగా ఉంచడానికి కాటన్ నిర్మించిన ఆనకట్టలు దోహదపడ్డాయన్నారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే యువత కాటన్ వంటి నిస్వార్థ నిపుణులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

అధ్యక్ష, కార్యదర్శులు చినబాలయ్య, మురళి

ప్రజాశక్తి - సీలేరు: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దామని గిరిజన సంఘ జిల్లా నాయకులు గడుతూరు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండలం కేంద్రంలో గిరిజన సంఘం మండల మహాసభ నిర్వహించి, ప్రధాన సమస్యలపై చర్చించారు. ప్రధానంగా బోయ/వాల్మీకి బొంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. జిఒ3 రద్దుతో ఉత్పన్నమైన సమస్యలను చర్చించి, ఆ జీవో పునరుద్ధరణకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి భవిష్యత్తులో పోరాటం నిర్వహించాలని మహాసభలో చర్చించారు.

గిరిజన సంఘం మండల కమిటీ నూతన కార్యవర్గం

సమావేశంలో గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన సంఘం మండల కమిటీ అధ్యక్షులుగా కొర్ర చిన్నబాలయ్య, కార్యదర్శి మురళీ, చంటిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితోపాటు కార్యవర్గ సభ్యులుగా బూడిద రామారావు, వాంగి బాబురావు వంతల జోగేష్, సిలకల లక్ష్మమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిఒ 38తో స్థానిక పత్రికలకు అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రెస్ అక్రిడిటేషన్ జిఒ 38తో స్థానిక పత్రికలకు అన్యాయం జరుగుతోందని, ఆ జిఒను సవరించి అక్రిడిటేషన్లు జారీ చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎంఎ) ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ జిఒ వల్ల అనేకమంది జర్నలిస్టులు ప్రెస్ అక్రిడిటేషన్లు కోల్పోతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొత్త జీవోలో ఇన్ కం టాక్స్ రిటర్న్స్ జతచేయాలనే నిబంధనను తొలగించాలన్నారు. గతంలో మాదిరిగానే ఎంప్యానల్‌మెంట్ కలిగిన, ఎంప్యానల్ మెంట్‌లేని స్థానిక దినపత్రికలన్నింటికీ ప్రచురణ కేంద్రం కలిగిన జిల్లాలోని నియోజకవర్గాలతో పాటు ఇతర జిల్లాల్లోనూ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రెస్ అక్రిడిటేషన్లు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, ధవలేశ్వరపు రవికుమార్, ప్రతినిధులు బి.నారాయణరావు, రాజా అబ్బాస్, ఎస్.సన్యాస రావు, కె.చక్రవర్తి, బిఎ.నాయుడు, ఎం.శ్రీహరి, కె.అప్పలరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా విసిసి సమ్మర్ క్యాంపులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కొద్దిరోజులుగా జిల్లా వ్యాప్తంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపులు ఉత్సాహంగా సాగుతున్నాయి. పిల్లలకు ఇవి ఎంతో ఊరటనిస్తున్నాయి. తాత, అవ్వ చెప్పే కథలు, కల్పితాల నుంచి వచ్చే ఊహాశక్తిని పిల్లలలో పెంపొందించడం, ప్రకృతి, సమాజం పట్ల ఆసక్తి పెంచడం, స్నేహితులతో ఆటలు, ఇంటి పనిలో సహాయం అలవాటు చేయడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. 'వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు కావాలి, మరచిపోలేని జ్ఞాపకం కావాలి, సెలవులు తరువాత స్కూలు, కాలేజీకి సంతోషంగా వెళ్లాలి' అన్న మంచి ఆశయంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపులలో వందలాది మంది ఎక్కడికక్కడే పాల్గొంటున్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం తలిదండ్రులు, పాఠశాలలు మాత్రమే సరిపోవని, వారి కోసం అనేక వేదికలు, వ్యక్తులు, సంస్థలు పని చేయాలని, అందుకే విసిసి ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంపులు చేపడుతోందని నిర్వాహకులు తెలిపారు .తల్లిదండ్రుల సహాయ సహకారాలువుంటే మరింత మందిని ఈ క్యాంపులలో భాగస్వామ్యం చేయవచ్చునన్నారు. పాటలు పాడించడం, నేర్పడం, బొమ్మలు వేయించడం, నేర్పడం, చిన్న చిన్న ఏకపాత్రలు, మైమ్ మొదలైనవి, పాటలకు నృత్యం నేర్పడం. బొమ్మలు ఉన్న కథల పుస్తకాలను ఇచ్చి చదివించడం, చదివిన కథను చెప్పించడం, ఓరిగామి, చిన్న చిన్న ప్రయోగాలను చేయించడం, ఆకులు, పూలు, స్టాంపులు, కాయిన్స్ సేకరించే అలవాటు నేర్పడం, ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీస్, చిన్న చిన్న ఆటలు ఆడించడం, చదరంగం, చైనీస్ చెక్కర్ వంటివాటిలో అందరినీ భాగస్వామ్యం చేస్తూ సమిష్టితత్వం పెంచేవిధంగా నిర్వహించడం ఈ క్యాంపుల్లో ప్రత్యేకతని నిర్వాహకులు చెబుతున్నారు. ఏప్రిల్ 30న వర్క్ షాప్స్ నిర్వహించిన తరువాత నగరంలో 45 చోట్ల క్యాంపులు నడుస్తున్నాయని, మొత్తం 100 ప్రాంతాల్లో సమ్మర్ క్యాంపులు చేపడుతున్నామని వెల్లడించారు.

ఆ డిపిఆర్ మాకొద్దు !

ఉపయోగం లేని పనులెందుకు ?
తీవ్రమౌతున్న ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల పోరు
ఫింగర్ జెట్టీలు, సౌకర్యాల కోసం పట్టు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒక వైపు సముద్ర హోరు.. మరో వైపు మత్స్యకారుల పోరు - ఇదీ విశాఖ నగరంలోని చేపలరేవులో నెలకొన్న తాజా పరిస్థితి. కొద్దిరోజులుగా అక్కడి మత్స్యకారులంతా తమ గోడు వినాలంటూ అధికార యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి కోసమంటూ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తమకొద్దని, దాని వల్ల ఎటువంటి ఉపయోగమూ కలగదని వారు మండిపడుతున్నారు. హార్బర్‌లో సౌకర్యాలు కల్పించాలని, ఫింగర్ జెట్టీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ధర్నా చేస్తున్న మత్స్యకార సంఘాల నాయకులు

హార్బర్‌తో ముడిపడిన జీవనం

ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చేపల వ్యాపారులు, సంప్రదాయ మత్స్యకారులు వేటకెళ్లొచ్చాక ఇక్కడ తమ ఉత్పత్తులను అమ్ముకోడానికి సరైన స్థలం ఉండాలంటూ తొలినుంచీ పోరాడుతూనే ఉన్నారు. విసిటిపిఎల్ విస్తరణ జరిగాక కొన్ని షెడ్లు వీరికోసం నిర్మించినా ఇంకా వందల సంఖ్యలో షెడ్లు అవసరం. అవిలేక వారంతా అవస్థలు పడుతున్నారు. కొత్తగా కొన్ని షెడ్లు వేయాలన్న డిమాండ్ వీరినుంచి వినిపిస్తోంది. గతంలో మేరీమాత గుడి దగ్గర బీచింగ్ పాయింట్ మత్స్యకారులకు ఉండేది. సుమారు 40 బోట్లు రిపేర్లు చేసుకునే ఈ ప్రదేశాన్ని వైజాగ్ పోర్టు కబ్జా చేసింది. దీనికి బదులుగా స్లిప్ వే కాంప్లెక్స్‌లో కొత్తగా బీచ్ పాయింట్, బోట్లును పైకి లాగేందుకు క్రేన్, 8 ట్రాలీలు.. రూ.152 కోట్ల డిపిఆర్‌లో మచ్చుకైనా లేవు. వీటిని చేర్చితేనే తమకు ప్రయోజనకరమని, లేకుంటే ఫిషింగ్ హార్బర్ నుంచి వందల కుటుంబాలు ఖాళీ చేసే దుస్థితి ఏర్పడనుందన్న వాదనను మత్స్యకారులు వినిపిస్తున్నారు.

ఫింగర్ జెట్టీలే ప్రధాన డిమాండ్

గతం నుంచీ మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్‌లో ఫింగర్ జెట్టీలనే కోరుతున్నా లెక్కజేయకుండా పోర్టు ఫ్లోటింగ్ జెట్టీలకే మొగ్గుచూపడంతో వారు మండిపడుతున్నారు. 40 టన్నుల సామర్థ్యంగల వెస్సెల్స్ ఐస్, ఆయిల్ లోడింగ్ చేసుకునేటప్పుడు ఫింగర్ జెట్టీలైతేనే కాయగలవు. అందుకే ఈ జెట్టీల కోసమే మత్స్యకారులు పట్టుబడుతున్నారు. అలాగే జీరో నెంబరు జెట్టీ నుంచి 11వ నెంబరు జెట్టీ వరకూ గతంలో మునిగిపోయిన బోట్లను బయటకు తీసే బాధ్యతను పోర్టు యాజమాన్యం చేపట్టాలన్నది వీరి డిమాండ్‌గా ఉంది. డిపిఆర్‌లో ఈ అంశాలేవీ పొందుపరచనందున మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘాలు తాజాగా పోరుబాట పట్టాయి.

బిజెపి హంగామా దేనికి ?

ఇన్నాళ్లుగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలపై కన్నెత్తి చూడని బిజెపి నేతలు ఇదే తడవుగా ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావుతో కలిసి ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం పర్యటన చేసేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం. పోర్టుతో లాబీయింగ్ జరిపి పరిష్కరించాల్సిన స్థానంలో ఉన్న జివిఎల్ 'సోలో పెర్ఫార్మెన్స్'కు దిగడం చూస్తే సొంత లబ్ధికోసం తప్ప మరొకటి కాదని ఇట్టే అర్థమవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మత్స్యకార సంఘాల ధర్నా

విశాఖ కలెక్టరేట్ : కేంద్ర నిధులు రూ.152 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు కేవలం భవనాలు నిర్మించి అద్దెలు వసూలు చేసుకునే విధంగా ఉన్నాయని, ఇటువంటి అభివృద్ధి అవసరం లేదని మత్స్యకార సంఘాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద మత్స్యకారుల సంఘాలు ధర్నా నిర్వహించాయి. అనంతరం ధర్నాకు నాయకత్వం వహించిన ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, విశాఖ డాల్ఫిన్ బోటు ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, విశాఖ కోస్టల్ మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు మీడియాతో మాట్లాడుతూ హార్బర్‌లో ఫ్లోటింగ్ జెట్టీలు నిర్మించొద్దన్నారు. ప్రస్తుతమున్న జెట్టీల ఎత్తు పెంచాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ప్లే ఫిట్ టీం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ - 2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒడిశా స్టీవ్‌డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జెకె.నాయక్, ఎస్ఎంఎస్ డెంటల్ చైర్మన్ డాక్టర్ బి శ్రీధర్ హాజరై విజేతలకు షీల్డ్‌లు, మెమొంటోలతో పాటు రూ.4 లక్షల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డివిఎస్‌వై.శర్మ మాట్లాడుతూ ఈ పోటీలలో ఆరు రాష్ట్రాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఎస్ఎంఎస్ డెంటల్ 32 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా, ఒఎస్ఎల్ గ్రూప్ 31 పాయింట్లతో ద్వితీయ స్థానంలోనూ, విఎస్ఐఎల్ 29 పాయింట్లతో తృతీయ స్థానంలోనూ నిలిచాయని వెల్లడించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై నేడు రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయని, ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ దుర్ఘటన మరవకుండానే స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, ఫార్మా ఇండస్ట్రీస్, రెడ్డి ల్యాబ్స్, విద్యుత్తు పరిశ్రమల్లో ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణపై మంగళవారం విశాఖ నగరంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగనున్నట్టు తెలిపారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు, క్షతగాత్రుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్, లేబర్ డిపార్టుమెంట్ తనిఖీలు జరగడం లేదని తెలిపారు. ఇటువంటి నేపథ్యంలో 'పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ - ప్రభుత్వాల వైఖరి' అన్న అంశంపై సిఐటియు రాష్ట్ర కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తలుగా పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జగదీష్ పటేల్ (గుజరాత్), సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరవుతారని తెలిపారు. కార్మికులు, బాధిత కుటుంబాలు, మేధావులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో -కన్వీనర్ కెఎం.కుమార్ మంగళం, సిఐటియు నాయకులు వి.కృష్ణారావు, కెవిపి.చంద్రమౌళి, పి.వెంకటరావు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు, పిడిఎస్‌యు సంఘాల ఆధ్వర్యంలో నగరంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, భారత బచావో కో-ఆర్డినేటర్ గూడూరు సీతామహాలక్ష్మి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి టి.అభి మాట్లాడారు. మహిళా రెజ్లర్లపై లైంగక వేధింపులకు పాల్పడ్డ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ విడుదల చేసినప్పటికీ ఇప్పటికీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్నటువంటి వారందరినీ నిరోధించాలంటే దేశవ్యాప్తంగా మహిళలు పని చేస్తున్న ప్రాంతాల్లో ఇంటర్నల్ కంప్లైంట్ సెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, రాష్ట్ర కోశాధికారి జయలక్ష్మి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఇ.సాయి, డిటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.